క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి విరాళాలు

అంబాజీపేట: స్థానిక కొర్లపాటివారిపాలెంలో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వర స్వామికి దాతలు విరాళాలను అందించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కసిరెడ్డి లక్ష్మీనరసింహారావు జ్ఞాపకార్థం వారి కుమారుడు శ్రీనివాసరావు రూ.లక్ష, పరసా నాగేశ్వరరావు జ్ఞాపకార్థం వారి భార్య శ్రీలక్ష్మీకాంతం రూ.లక్ష, మేడిద వెంకటేశ్వరరావు (అబ్బు) అల్లుడు, కుమార్తె మానేపల్లి తాతయ్యనాయుడు, సీతాఫణి దంపతుల కుమారుడు పుట్టినరోజు సందర్భంగా రూ.1.32 లక్షలు, కోట రమేష్, సుమ దంపతులు రూ.లక్ష, రవణం సత్యనారాయణ, వెంకట నరసాయమ్మ జ్ఞాపకార్థంగా వారి కుమారుడు హరిబాబు రూ.15 వేలను వెంకటేశ్వరునికి విరాళాలుగా అందించారని ఆలయ కమిటీ చైర్మన్ మేడిద శ్రీనివాస్, కమిటీ సభ్యులు తెలిపారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి ప్రచారం

అంబాజీపేట: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి పేపకాయల రాజు ఆదివారం పట్టభద్రులను కలసి ఓట్లను అభ్యర్థించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట కొర్లపాటివారిపాలేనికి చెందిన పేపకాయల రాజు అంబాజీపేటలో పట్టభద్రులను కలసి తనను గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. పట్టభద్రులంతా తన అభ్యర్థిత్వాన్ని బలపరిచి, తన విజయానికి కృషి చేయాలన్నారు. పట్టభద్రుల గళాన్ని పెద్దల సభలో వినిపించేందుకు, నిరుద్యోగ, ప్రైవేటు ఉద్యోగుల, పట్టభద్రుల సమస్యలపై పోరాడేందుకు తనను ఎమ్మెల్సీగా ఎన్నుకోవాలని రాజు కోరారు.

ఉచిత వైద్య పరీక్షలు



ఆరోగ్య పరీక్షలు చేస్తున్న అశోక్‌వర్మ

మామిడికుదురు: గోగన్నమఠం గ్రామంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం జరిగింది. భూపతిరాజు భరత్‌వర్మ స్మారకార్థం ఏర్పాటు చేసిన శిబిరంలో భీమవరం అశోక్ కిడ్నీ సెంటర్‌కు చెందిన డాక్టర్ భూపతిరాజు అశోక్‌వర్మ, ప్రముఖ డాక్టర్లు వి.సందీప్‌కుమార్, బీవీఆర్ఎస్ గజపతిరాజు సాగిరాజు, అతీఫ్ ఉద్దీన్, రాజశేఖర్, ప్రసాద్‌రాజు సుమారు 200 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. గుండె, కిడ్నీ, ఊపిరితిత్తులు, లివర్, మూత్రనాళ, జనరల్ సర్జరీ, చిన్న పిల్లలు, బీపీ, సుగర్, థైరాయిడ్, జనరల్ సమస్యలకు సంబంధించి ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు భూపతిరాజు లక్ష్మి, మాజీ జెడ్పీటీసీ భూపతిరాజు ఈశ్వరరాజువర్మ, భూపతిరాజు సత్తిబాబురాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి సాయం



బాధితుడికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయపడి మంచాన పడిన బాధితుడికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు ఆదివారం రూ.15 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం రూరల్ పిడింగొయ్యికి చెందిన యార్లగడ్డ బాబి (27)కి రెండేళ్ల క్రితం కాకినాడలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకి తీవ్ర గాయమైంది. రూ.20 లక్షల వరకు ఖర్చుపెట్టి వైద్యం చేయించారు. అయినా కోలుకోలేదు. ఇప్పటికి ఇంటి దగ్గర మంచం మీదే ఉంటున్నారు. వైద్యం కోసం స్థానిక కాశీ అన్నపూర్ణాదేవిసేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. సంస్థ సభ్యులు బాబి ఇంటికి వెళ్లి రూ.15 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు.

వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య

పి.గన్నవరం: అత్తింటి వారి వేధింపులు తాళలేక కలుపుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ముంగండ గ్రామానికి చెందిన వివాహిత శీలం పావనికుమారి (26) అమలాపురంలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. పి.గన్నవరం ఎస్సై బి.శివకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ముంగండకు చెందిన శీలం అర్జునరావు అదే గ్రామానికి చెందిన పావనికుమారి ప్రేమించుకోవడంతో 2019లో వారికి వివాహం జరిపించారు. వీరికి ఐదేళ్ల కుమారుడు, మూడేళ్ల కుమార్తె ఉన్నారు. పెళ్లయిన ఆరు నెలల నుంచి అత్తమామలు, ఆడపడుచు కలసి పావనికుమారిని మానసికంగా, శారీరకంగా వేధించేవారని ఎస్సై వివరించారు. పెద్దల్లో పెట్టినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. పావని కుమారిపై అత్తమామలు లేనిపోని మాటలు చెప్పేవారని, దీంతో భర్త ఆమెను కొట్టేవాడన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 2న మళ్లీ భర్త, అత్తమామలు వేధించడంతో పావని కుమారి ఇంట్లో ఉన్న కలుపు నివారణ మందును తాగిందన్నారు. దీంతో ఆమెను భర్త అమలాపురంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందిందన్నారు. ఈ మేరకు మృతురాలి తండ్రి మామిడిశెట్టి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శివకృష్ణ వివరించారు.

రాతపై పట్టు.. మార్కులు కొల్లగొట్టు

- పరీక్షల్లో చేతి రాత కూడా ముఖ్యం
- టెన్త్, ఇంటర్ విద్యార్థులకు నేర్చేందుకు ఇది సరైన సమయం
- దస్తూరిపై సాధన చేయాలంటున్న నిపుణులు



కొత్తపాలెం పాఠశాలలో రాతపై సాధన చేస్తున్న విద్యార్థులు

కొత్తపేట: పరీక్ష రాసే విద్యార్థుల చేతి రాత బాగుంటే మూల్యాంకనం చేసే వారికి సులువుగా అర్థమవుతుంది. ఫలితంగా మంచి మార్కులు వేస్తారు. చేతి రాత బాగాలేకపోతే మూల్యాంకనం చేసే వారికి సమాధానం అర్థం కాకుంటే ఒక మార్కు లేదా అర మార్కు తగ్గే అవకాశం ఉంటుంది. ఇది టోటల్ మార్కులపై ప్రభావం చూపి ర్యాంకు తగ్గే అవకాశం లేకపోలేదు. విద్యార్థులు చేతిరాతపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా వుంది.

వచ్చే మార్చి 1 నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం

ప్రస్తుత 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు మార్చి 1 నుంచి ప్రారంభం కాగా 20 వరకూ జరగనున్నాయి. కొత్తపేట, పి.గన్నవరం, రాజోలు నియోజకవర్గాల్లో సుమారు 10,825 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పదో తరగతి పరీక్షలు మార్చి 17 నుంచి 31 వరకూ జరగనున్నాయి. మూడు నియోజకవర్గాల్లో సుమారు 11,320 మంది విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవుతున్నారు. పరీక్షలకు రెండు నెలలకు పైగా సమయం ఉన్నందున



గుండ్రటి అక్షరాలు రాస్తూ..

విద్యార్థులు ప్రతి రోజూ అరగంట చేతిరాతపై సాధన చేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

పరీక్షల్లో చేతిరాత ఎలా ఉండాలో నిపుణుల మాటల్లోనే..

- విద్యార్థుల ఆన్సర్ షీట్ (బుక్లెట్)లో సమాధానాలను స్పష్టంగా రాయాలి.
- నాలుగు వైపులా మార్జిన్లు (బార్డర్లు) వేసుకుంటే అందంగా ఉంటుంది.
- బుక్లెట్లో ఎడమవైపు రెండున్నర సెంటీమీటరు, కుడివైపు, పైనా, కింద ఒకటిన్నర సెంటీ మీటర్ బార్డర్ వేసుకోవాలి
- ఒక లైన్, మరో లైనుకు ఒకటిన్నర సెంటీమీటర్ గ్యాప్ ఇవ్వాలి.
- పదానికి, పదానికి అర్థ సెంటీ మీటర్ స్పేస్ ఇవ్వాలి.
- బుక్లెట్ వాక్యాలు పైకి కిందకు లేకుండా వరుస క్రమంలో ఉండాలి.
- బొటన వేలు, మూడో వేలికి మధ్య చూపుడు వేలు సాయంతో పెన్నును చక్కగా పట్టుకోవాలి. ఇలా చేయడం వల్ల రాసే సమయంలో స్పీడుగా ముందుకు కదులుతుంది.
- ముఖ్యంగా పరీక్షల సమయంలో విద్యార్థులు తగినంత విశ్రాంతి తీసుకోవాలి. లేకుంటే ఆ ప్రభావం చేతిరాతపై కూడా పడుతుంది.
- మనసు ప్రశాంతంగా ఉంటే చేతిరాత చక్కగా వస్తుంది. సమాధాన పత్రంలో అక్షరాలు బాగుంటే ప్రతి సబ్జెక్టులో కనీసం నాలుగు నుంచి ఐదు మార్కులు పెరిగే అవకాశం ఉంది.
- అక్షరాలు బాగాలేకపోతే అన్ని సబ్జెక్టులపై చాలా మార్కులు కోల్పోవాల్సి వస్తుంది.

సాధనతోనే చక్కటి చేతిరాత సాధ్యం



చక్కటి చేతిరాత సాధనతోనే సాధ్యం కాగలదు. పరీక్షలకు ఇంకా సమయం ఉన్నందున విద్యార్థులు అక్షరాలను గుండ్రంగా రాసేందుకు సమయం కేటాయించి సాధన చేయాలి. చాలా మంది తొలి ప్రశ్నకు గుండ్రటి అక్షరాలతో సమాధానం రాస్తారు. ఆ తరువాత సమయం అయిపోతుందనే కంగారుతో వేగంగా రాయడం ప్రారంభిస్తారు. గుండ్రటి అక్షరాలు కుదరవు. ఈ ప్రభావం మార్కులపై పడుతుంది. అన్ని ప్రశ్నలకు సమాధానాలు గుండ్రంగా రాయాలంటే సాధన తప్పనిసరి.

– ఎ.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయుడు, జెడ్పీ ఉన్నత పాఠశాల, కొత్తపాలెం

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సాయం



సాయం అందిస్తున్న శ్రీనేస్తం సేవా సమితి సభ్యులు

రాజోలు: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న కూనవరం గ్రామానికి చెందిన లక్కోజు రాంబాబుకు శ్రీ నేస్తం సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం రూ.25 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. రాష్ట్ర నెడ్క్యాప్ మాజీ డైరెక్టర్ పాటి శివకుమార్ చేతుల మీదుగా ఆర్థిక సాయాన్ని పంపిణీ చేశారు. శ్రీ నేస్తం సేవా సమితి సేవలు అభినందనీయమన్నారు. రాంబాబు రెండు కిడ్నీలు పాడైపోవడంతో వైద్య ఖర్చులకు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ చెల్లింగి అబ్బులు, సీహెచ్ పెద్ద, శ్రీను పాల్గొన్నారు.

నేటి నుంచి ఆటలతో ఆరోగ్యం

అంబాజీపేట: కోనసీమ క్రీడోత్సవం-ఆటలతో ఆరోగ్యం పేరిట మండల స్థాయి క్రీడా పోటీలను ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఎంఈఓ కాండ్రేగుల వెంకటేశ్వరరావు అన్నారు. జూనియర్ విభాగంలో 4, 5, 6 తరగతుల విద్యార్థులకు 100, 200 మీటర్ల రన్నింగ్, లాంగ్ జంప్, త్రోబాల్ నిర్వహించనున్నామన్నారు. సీనియర్ విభాగంలో 7, 8, 9 తరగతుల విద్యార్థులకు కబడ్డీ, కోకో, క్రికెట్, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ క్రీడా పోటీల్లో ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు మాత్రమే పాల్గొనాలన్నారు. ఈ పోటీలు ఉదయం 10 గంటలకు ప్రారంభం కానున్నాయన్నారు.

ప్రభల ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి

- అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు
- రావులపాలెం రూరల్ సీఐ విద్యాసాగర్
- ఉత్సవ కమిటీలతో సమీక్ష



కొత్తపేట ప్రభల ఉత్సవ కమిటీ సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ విద్యాసాగర్

కొత్తపేట: మకర సంక్రాంతి సందర్భంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగే కొత్తపేట ప్రభల ఉత్సవాలు శాంతియుతంగా జరిగేలా ఉత్సవ కమిటీ అన్ని చర్యలు తీసుకోవాలని రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ సూచించారు. కొత్తపేట మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం ప్రభల ఉత్సవ కమిటీ సభ్యులతో ఎస్సై జి.సురేంద్ర అధ్యక్షతన సమీక్ష నిర్వహించారు. సమావేశంలో సీఐ ముఖ్యఅతిథిగా పాల్గొని పలు సూచనలు చేశారు. ప్రభల ఉత్సవాల్లో అశ్లీల నృత్యాలకు తావులేదని స్పష్టం చేశారు. నిబంధనలకు లోబడి ఉత్సవాలు జరుపుకోవాలని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభల ఊరేగింపులో, బాణసంచా కాల్పుల సమయంలో ఉత్సవాల నిర్వాహకులు పూర్తి బాధ్యత తీసుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా సంబంధిత వ్యక్తులతో పాటు నిర్వాహకులపై కూడా కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. ప్రభల ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో ప్రజలు సంతోషంగా జరుపుకొనేలా సమన్వయంతో పనిచేయాలని, పోలీసులు తీసుకునే చర్యలకు సహకరించాలని కోరారు. సమావేశంలో కొత్త రామాలయం ఉత్సవ కమిటీ కన్వీనర్ ముత్యాల వీరభద్రరావు, చింతం సురేష్, పాత రామాలయం ఉత్సవ కమిటీ సభ్యులు ముద్రగడ సుబ్బారావు, సలాది మావాజీ, కనకాల నాగబంగారం, నిమ్మకాయల చిన్నయ్యనాయుడు, బోడిపాలెం ఉత్సవ కమిటీ సభ్యులు అన్యం సత్తిరాజు, బోడపనీడి గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా 'మల్లెల రమణీయం'



జోన్ చైర్ పర్సన్ మల్లికార్జునస్వామికి లయన్స్ క్లబ్ ప్రతినిధులు స్వాగతం

మామిడికుదురు: అంతర్జాతీయ స్థాయిలో లయన్స్ క్లబ్ ద్వారా ప్రజలకు ఉపయోగపడే పలు సామాజిక, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అమలాపురం జోన్ చైర్ పర్సన్ జి.శ్రీమల్లికార్జున స్వామి ఉద్ఘాటించారు. పాశర్లపూడిబాడవ వైనతేయ గోదావరి నదీతీరంలో ఆదివారం అమలాపురం పరిధిలోని అయిదు క్లస్టర్ల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 'మల్లెల రమణీయం' కార్యక్రమం ఆద్యంతం ఉల్లాసంగా, ఉత్సాహంగా జరిగింది. దీనిలో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఆటలు, పాటలు పోటీలు ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులు అందించారు. సహపంక్తి భోజనాలు చేశారు. సభలో మల్లికార్జునస్వామి మాట్లాడుతు సామాజిక సేవలే లక్ష్యంగా లయన్స్ క్లబ్ ఉచిత వైద్య, ఆరోగ్య సేవలతో పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు అందుకుంటుందన్నారు. ఈ సేవలను మరింత విస్తరించే దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. ముందుగా కార్యక్రమానికి విచ్చేసిన మల్లికార్జునరావు దంపతులకు క్లబ్ ప్రతినిధులు పూర్ణ కుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు ఆర్.వేణుగోపాలరావు, కార్యదర్శి ఎం.వెంకటేశ్వరరావు, కోశాధికారి పి.వెంకటపతిరాజు, జి.వీరభద్రమణి పాల్గొన్నారు.

మండల స్థాయి విస్తృత సమావేశం



సఖినేటిపల్లి క్షత్రియ కల్యాణ మండపం వద్ద బీజేపీ విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న శ్రేణులు

సఖినేటిపల్లి: స్థానిక క్షత్రియ కల్యాణ మండపంలో ఆదివారం బీజేపీ మండల స్థాయి విస్తృత కార్యకర్తల, నాయకుల సమావేశం పార్టీ నాయకుడు పట్టపు సూర్యప్రకాశరావు అధ్యక్షతన జరిగింది. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్ నేతృత్వంలో సమావేశంలో మండల నూతన పార్టీ అధ్యక్షుడిగా అంతర్వేది దేవస్థానానికి చెందిన పోతురాజు సురేష్‌ను, అలాగే పార్టీ మండల అధికార ప్రతినిధిగా ఉద్దరాజు రామకృష్ణంరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇందుకూరి అచ్యుతరామరాజు, పర్యవేక్షకుడు అడబాల సత్యనారాయణ, సురేష్ నియామకాన్ని ప్రకటించారు. కాగా పార్టీ తనపై ఉంచిన బాధ్యతలను నెరవేర్చి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని సురేష్ తెలిపారు. కిసాన్ మోర్చా రాష్ట్ర డైయినేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు, నాయకులు, బూత్ కమిటీ అధ్యక్షులు పాల్గొన్నారు.

ఘనంగా లక్షతులసి పూజ



అంబాజీపేటలో వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మహిళలు

అంబాజీపేట: అంబాజీపేట కొర్లపాటివారిపాలెంలో వేంచేసియున్న శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో లక్షతులసి పూజ ఆదివారం వైభవంగా జరిగింది. పాణింగపల్లి నరసింహాచార్యులు పర్యవేక్షణలో పెద్దింటి వెంకటలక్ష్మీ నరసింహాచార్యుల ఆధ్వర్యంలో వైఖానస ఆగమ, శైవ, శాక్తేయ, స్మార్త, ఆగమ విధానాల ప్రకారం ఈ పూజ నిర్వహించారు. విష్ణు సహస్ర నామార్చన, విష్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, న్యాసార్చన, పంచామృతాభిషేకం, లక్షతులసి పూజ, కుంకుమార్చన, గుడోదకతర్పణం, సమిదాజ్య, చరుబ్రీహి హోమాలు జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలు గోవింద నామాలతో పులకించిపోయింది. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి లక్ష తులసి పూజ చేపట్టారు. స్వామి వారి ఆలయ ప్రాంగణం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన చేపట్టారు.

ఆపదలో సంఘీయుల సాయం



బాధితుడికి సాయం అందిస్తున్న టెంట్‌హౌస్ అసోసియేషన్ సభ్యులు

రావులపాలెం: స్థానిక కోనసీమ టెంట్ హౌస్ ఓనర్స్ అసోసియేషన్ యూనియన్ సంఘ సభ్యుల్లో ఒకడైన బొక్కా బాబీ తండ్రి నారాయణకు ఇటీవల రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రమాదంలో తలకు తీవ్రగాయం కావడంతో రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. ఆర్థికస్తోమత లేని బాబీ కుటుంబానికి సాయం చేయాలని సంఘ సభ్యులు అధ్యక్షుడు వెలగల కాశీరెడ్డి నేతృత్వంలో విరాళాలు సేకరించారు. సంఘీయులు అందరూ కలసి రూ.70 వేల నగదును సమకూర్చారు. ఆదివారం ఈ నగదును సంఘ సభ్యులు గుడిమెట్ల శ్రీనివాస రెడ్డి, నాని, కొవ్వూరి గంగిరెడ్డి లు ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న నారాయణకు అందజేశారు. సంఘీయుల ఐక్యతను స్థానికులు అభినందించారు.

ఘనంగా గొబ్బెమ్మల వేడుకలు



కొత్తపేట సత్యసాయి నిలయంలో గొబ్బెమ్మల పూజ చేస్తున్న బాలికలు

కొత్తపేట: ధనుర్మాసంలో సంక్రాంతి ముందు మహిళలు, బాలికలు గొబ్బెమ్మల వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీ. సంక్రాంతి వారంలో ఎక్కడిక్కడ మహిళలు, యువతులు, బాలికలు ఆదివారం గొబ్బెమ్మల ఉత్సవాన్ని జరుపుకొంటారు. దానిలో భాగంగా స్థానిక సత్యసాయిబాబా వారి నిలయంలో ఆదివారం సాయంత్రం సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కంకటాల సత్యనారాయణ (కేఎస్ఎన్), సభ్యుల ఆధ్వర్యంలో బాలికలతో గొబ్బెమ్మల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక మహిళలు, బాలికలు పాల్గొన్నారు. సత్యసాయి నిలయంలో మధ్య శ్రీకృష్ణుని విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గొబ్బి మహాగౌరీ దేవిని ఆహ్వానిస్తూ బాలికలు నృత్యం చేవారు. పెద్దలు బాలికలను ఆశీర్వదించారు. అనంతరం బాలికకు భోగిపళ్లు పోసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ తాంబూలాలు పంచారు.

భగవద్గీత పఠనంతో మనస్సు ప్రశాంతం



విఘ్నేశ్వరుని ఆలయంలో భగవద్గీత పారాయణ చేస్తున్న భక్తులు

అయినవిల్లి: భగవద్గీత పఠనంతో మనస్సు ప్రశాంతంగా ఉంటుందని అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్ నిర్వాహకుడు సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ అన్నారు. ఆదివారం నల్లచెరువులో అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిరంలో ఈ కృష్ణునికి విశేష అభిషేకాలు, పూజలు జరిపారు. సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ మాట్లాడుతూ హరేకృష్ణ మంత్రం జపించిన వారికి అనుక్షణం ప్రశాంత వాతావరణం ఉంటుదన్నారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. అలాగే అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయంలో కాకినాడకు చెందిన మహిళా భక్తులు పెద్ద ఎత్తున వచ్చి స్వామిని దర్శించి భగవద్గీత పారాయణ చేశారు.

హైందవ శంఖారావానికి తరలివెళ్లిన భక్తులు

అంబాజీపేట: దేవాలయాల ధర్మ పరిరక్షణ, ఆస్తులు పరిరక్షణ, సనాతన ధర్మ పరిరక్షణ కోసం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన హైందవ శంఖారావానికి అంబాజీపేట మండలం నుంచి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు వివిధ వాహనాల్లో తరలివెళ్లారు. జైశ్రీరామ్ నినాదాలతో హిందువుల ఐక్యత వర్ధిల్లాలి సనాతన ధర్మం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. అనంతరం వివిధ వాహనాల్లో తరలివెళ్లారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: విజయవాడలో జరిగిన హైందవ శంఖారావం బహిరంగ సభకు ఆదివారం మండలం నుంచి భారీగా హిందువులు తరలివెళ్లారు. బస్సులు, కార్లు, తదితర వాహనాలతో కాషాయం జెండాలు తీసుకుని సభకు తరలివెళ్లారు. శంఖారావం సభకు వెళ్తున్న సందర్భంగా జై శ్రీరామ్,, జైజై శ్రీరామ్ నినాదాలు మార్మోగాయి. 21 బస్సులు, ఇతర వాహనాల్లో వెయ్యి మందికి పైగా హిందువులు శంఖారావం సభకు వెళ్లారు. ప్రతి గ్రామంలోనూ ఆధ్యాత్మిక సందడి నెలకొంది. విశ్వహిందూ పరిషత్‌తో పాటు ఇతర హిందూ సంఘాలు శంఖారావం సభకు జనసమీకరణ చేశారు.



అప్పనపల్లి నుంచి శంఖారావం సభకు బయలు దేరిన హిందువులు



పుల్లేటికుర్రులో హైందవ శంఖారావానికి వెళుతున్న భక్తులు

అయినవిల్లిలో..

అయినవిల్లి: విజయవాడలో నిర్వహిస్తున్న శంఖారావానికి అయినవిల్లి మండలం నుంచి అధిక సంఖ్యలో హిందువులు తరలివెళ్లారు. హిందూధర్మం వర్ధిల్లాలి అంటూ వారు నినాదాలు చేశారు. సనాతన ధర్మం హిందూధర్మమేనన్నారు. అయినవిల్లి, వీరవల్లిపాలెం, నేదునూరు, విలస, తొత్తరమూడి గ్రామాల నుంచి అధిక సంఖ్యలో అయినవిల్లి విఘ్నేశ్వర స్వామి సన్నిధికి చేరుకున్నారు. స్వామికి ప్రత్యేక పూజలు చేసి వారు బయలుదేరి వెళ్లారు.

జన జీవితానికి దగ్గరగా కవిత్వం ఉండాలి



కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న డాక్టర్ ప్రతాప్

సఖినేటిపల్లి: జన జీవితాలకు దగ్గరగా రాస్తే మంచి కవిత్వం ఉద్భవిస్తుందని శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ అన్నారు. ఆదివారం ఉయ్యూరువారి మెరకలో ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో అంతర్జాతీయ సాహిత్య సంస్థ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ముందస్తు సంక్రాంతి సాహిత్య, సాంస్కృతిక సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ కళా వేదిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కన్వీనర్ డాక్టర్ బీవీవీ సత్యనారాయణ అధ్యక్షతన దళిత కవుల సమ్మేళనం, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పలువురు కవులు సామాజిక అంశాలపై కవిత్వాన్ని కవితాగానం చేశారు. నడక పుస్తకాన్ని ఆవిష్కరించారు. కడలి కెరటాలు నాటిక ప్రదర్శించారు. కవి, రచయిత మాకే బాలార్జున సత్యనారాయణ మాట్లాడుతూ, దగాపడిన జీవితాల నుంచి దళిత కవిత్వం పుట్టుకొస్తుందని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న కవులందరినీ మెమెంటో, ప్రశంసా పత్రాలతో సత్కరించారు. శ్రీశ్రీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, సహజ కవి పొలమూరి వెంకట్, గంటి చంద్రశేఖర్, తెలుగు టీచర్ రాజబాబు, కడలి సత్యనారాయణ, సుభాషిణి, రామారావు, ధర్మారావు, మోహన్, గంగాధరం, రాజు, సారథి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఉత్సవాలు ప్రారంభం

రావులపాలెం: మండలంలోని గ్రామాల్లో సంక్రాంతి పండగ నేపథ్యంలో అమ్మవార్ల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆయా గ్రామాల్లో అమ్మవార్లను అత్తవారి ఇంటి నుంచి గరగ నృత్యాలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకువచ్చారు. సంక్రాంతి వరకూ ఊరేగింపులు నిర్వహించనున్నారు. సంక్రాంతి రోజున గ్రామదేవతల జాతర నిర్వహించనున్నారు.